చారిత్రక భవనం పరిరక్షణకు అడుగులు

- ఏయూకు తలమానికంగా ఫిజిక్స్ విభాగం భవనం
- 89 ఏళ్ల కిందట నిర్మాణం
- పటిష్టతకు చర్యలు చేపట్టిన అధికారులు



ఏయూ భౌతికశాస్త్ర విభాగం



సుందరంగా తీర్చిదిద్దిన భవనం లోపలి భాగం

ఏయూ క్యాంపస్: చారిత్రక భవనాలకు నెలవు ఆంధ్ర విశ్వవిద్యాలయం. అందులో ఫిజిక్స్ విభాగ భవనానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. తొమ్మిది దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం వర్సిటీకే తలమానికంగా నిలుస్తోంది. ఇంతటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ భవనం పటిష్టతకు అధికారులు నడుం బిగించారు.

విక్రమ్‌దేవ్ వర్మ కృషితో సాకారం

శాస్త్రీయ విజ్ఞానం ప్రజలందరికీ చేరువ కావాలని, సైన్స్‌ను అభ్యసించే వారి సంఖ్య పెరగాలని ఆలోచించిన జైపూర్ రాజు విక్రమ్‌దేవ్ వర్మ కృషి ఫలితంగా ఈ భవనం నిర్మాణానికి పునాది పడింది. తన సొంత నిధులతో 1931లో ఈ భవన నిర్మాణం ప్రారంభించి 1933లో పూర్తి చేశారు. పూర్తిగా రాతితో నిర్మితమైన ఈ భవనం రెండు అంతస్తులుగా ఉంటుంది. విశాలమైన కారిడార్‌లు, తరగతి గదులు, ప్రయోగశాలలు కలిగిన సువిశాల ప్రాంగణంలో ఎంతో అందంగా, హుందాగా దర్శనమిస్తోంది. భవనం పైభాగంలో నాలుగు దిక్కుల నుంచి సమయం తెలుసుకునే విధంగా ఏర్పాటు చేసిన గడియారం ఏయూకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

- భవనం మొత్తం ఆంగ్ల అక్షరం యూ ఆకారంలో ఉంటుంది. మధ్యలో భవనం పై అంతస్తుకు వెళ్లడానికి మెట్లు ఉన్నాయి. భవనం మొదటి, రెండో అంతస్తుల్లో ఎంతో సుందరంగా నేటికీ చెక్కు చెదరని విధంగా కళాత్మకంగా తీర్చిదిద్దిన గోడలు మనకు దర్శనమిస్తాయి. మెట్లు రాచరికపు రోజులను తలపించేలా హుందాగా ఉంటాయి. ఈ భవనంలో దాదాపు 40 మందికి పైగా ఆచార్యులు సేవలు అందించేలా ఏర్పాటు చేశారు. ఒక్కో అంతస్తులో 23 గదుల చొప్పున మొత్తం 46 గదులతో భవన నిర్మాణం జరిగింది.

ప్రెజర్ గ్రౌటింగ్‌తో పరిష్కారం

ప్రస్తుతం భవనం పైఅంతస్తుల్లో దెబ్బతిన్న శ్లాబ్‌కు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడుతున్నారు. దీనిలో భాగంగా పైకప్పు లోపలి భాగంలో ప్రత్యేకమైన రీ బాండింగ్‌తో అంతర్గత పగుళ్లను సరి చేయనున్నారు. అధునాతన ప్రెజర్ గ్రౌటింగ్ విధానాన్ని ఉపయోగించి భవన పటిష్టతను పెంచేలా ఇంజినీరింగ్ విభాగం అధికారులు పని చేస్తున్నారు. మరో రెండు దశల్లో మైక్రో కాంక్రీట్, ఎస్‌బీఆర్ లేటెక్స్, బేబీ చిప్స్ వంటివి మిక్సింగ్ చేసి కాంక్రీట్ చేస్తారు. దీనిపై అదనంగా మూడు లేయర్లుగా ప్రొటెక్టివ్ లేయర్‌ను వేయనున్నారు. తద్వారా భవనంపై నీరు నిలిచిపోకుండా ఉంటుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే భవనం పైన పడుతున్న చెట్లను ప్రూనింగ్ చేశారు. భవనం చుట్టూ పెరిగిన తుప్పలు, కలుపు మొక్కలను కూడా తొలగించారు. భవనంపై మొలిచిన రావి మొక్కలను తొలగించి, ప్రత్యేకమైన రసాయనాలతో అవి మళ్లీ పెరగకుండా ఉండడానికి సైతం చర్యలు తీసుకుంటున్నారు. వందేళ్లకు చేరువవుతున్న ఏయూకు ఒక చారిత్రక ఆధారంగా నిలిచే ఈ భవన పటిష్టతకు, పరిరక్షణకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయడంపై విద్యార్థులతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఇంజినీర్లు



రాజ దర్పణానికి నిదర్శనంగా మెట్ల నిర్మాణం

క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మీయ స్వాగతం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: శ్రీకాకుళం పర్యటనలో భాగంగా బుధవారం విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖ విమానాశ్రయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. తూర్పు నియోజకవర్గానికి చెందిన పలు అంశాలను సీఎంకు వివరించారు. హనుమంతవాక ఫ్లైఓవర్, తోటగరువు హైస్కూల్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటుకు సహకారం అందించాలని ఆమె కోరారు.

జైలులో రూ. 2.7 లక్షలకు పాడి పశువుల వేలం

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో డెయిరీ ఫారంలో ఉన్న ఆవులు, గేదెలు, వాటి దూడలను బుధవారం జైల్ అధికారులు వేలం వేశారు. జైల్ శాఖ డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్ సమక్షంలో డెయిరీలో ఉన్న 22 మగ, ఆడ పశువులకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో పలువురు రైతులు, వ్యాపారులు పాల్గొని వాటిని రూ 2.70 లక్షలకు సొంతం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు జైల్ పరేడ్ గ్రౌండ్‌లో ఇక్కడ మామిడి పంటను బహిరంగ వేలం వేయనున్నామన్నారు. ఈ పాడి పశువుల వేలంలో జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, అదనపు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ రామచంద్రరావు, జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్



మంటలు అదుపు చేయడంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

ఆరిలోవ: స్థానిక హెల్త్ సిటీ అపోలో ఆస్పత్రిలో అగ్నిమాపక అధికారులు బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ మాక్‌డ్రిల్ ఆకట్టుకుంది. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎలా స్పందించాలి, ఎలా అదుపు చేయాలి, తదితర అంశాలపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో ఉన్న అగ్ని ప్రమాద నివారణ పరికరాలు ఏవిధంగా ఉపయోగించాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ఆర్.వి.రామకృష్ణ, ఫైర్‌మెన్ సీహెచ్.లక్ష్మీనారాయణ, డీఎల్‌వో పీలు పి.రవికుమార్, కె.శ్రీనివాసరావు, సిబ్బంది గోవింద్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంతోనే పర్యావరణ పరిరక్షణ



బీచ్‌ను క్లీన్ చేస్తున్న ప్లాట్ ఫారం 65 సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్లాట్ ఫారం 65 రెస్టారెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధనలక్ష్మి పిలుపునిచ్చారు. ఎర్త్ డే పురస్కరించుకొని బుధవారం బీచ్ క్లీనింగ్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం అధికమవడంతో వాతావరణంలో మార్పులు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరు బాధ్యతతో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి భూమాతను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ సిబ్బంది, వాకర్స్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



18వ వార్డుల్లో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న పుక్కళ్ల ధనలక్ష్మి తదితరులు



22వ వార్డులో పథకాలపై అవగాహన కల్పిస్తున్న అక్కరమాని విజయనిర్మల

బీచ్ రోడ్డు: తూర్పు నియోజకవర్గ పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. బుధవారం 22వ వార్డు పరిధిలోని బలరాం నగర్, తార మసీద్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఇంటింటికీ వెళ్లి పథకాలపై అవగాహన కల్పించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథు పాల్గొన్నారు.

18 వార్డుల్లో..

ఎంవీపీ కాలనీ: జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని 18వ వార్డులో బుధవారం విస్తృతంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షురాలు పుక్కళ్ల ధనలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు వాసుపల్లి ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 26న బహిరంగ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్షాల నాయకులు

మద్దిలపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 26న కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నామని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు జగ్గునాయుడు, పైడిరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం పితాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు ప్రజలు, కార్మికులు, మహిళలు, యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14న ప్రారంభించిన ప్రచార భేరీ కార్యక్రమం 30వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. బీజేపీ విధానాలను ఎండగట్టడానికి 2 లక్షల కరపత్రాల పంపిణీతో పాటు, గ్రూపు మీటింగ్‌లు చేపడుతున్నామన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు కృష్ణమూర్తి కన్నుమూత



కృష్ణమూర్తి(ఫైల్)



ఏఎంసీకి అప్పగించడానికి కృష్ణమూర్తి పార్థివదేహాన్ని తీసుకెళ్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: సుదీర్ఘ కాలం పాటు సీపీఎంలో సేవలు అందించిన వి.కృష్ణమూర్తి(67) బుధవారం వేకువజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఆరిలోవలోని ఆయన నివాసంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించే సమయానికే ఆయన మృతి చెందినట్లు వెల్లడించారు. దీంతో కుటుంబ సభ్యులు తిరిగి ఆరిలోవ తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని కృష్ణమూర్తి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు జగ్గునాయుడు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎం.మణి, నరేంద్రకుమార్, శంకరరావు, సూర్యమణి, రంగమ్మ, సీపీఐ జిల్లా నాయకుడు రెహమాన్ తదితరులు అంజలి ఘటించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో నాయకులు మాట్లాడుతూ కృష్ణమూర్తి చేసిన పోరాటాలు, అందించిన సేవలను కొనియాడారు. పోరాట పటిమ ఉన్న మంచి వ్యక్తిని సీపీఎం కోల్పోయిందని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ సంస్మరణ సభలో కన్నీరుపెట్టుకున్నారు. కృష్ణమూర్తికి భార్య అన్నపూర్ణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఏఎంసీకి పార్థివదేహం అప్పగింత

కృష్ణమూర్తి ఆలోచనలకు అనుగుణంగా కుటుంబ సభ్యులు ఆయన పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం అప్పగించడానికి అంగీకరించారు. ఇందులో భాగంగా అతని నేత్రాలు ఎల్వీపీ కంటి ఆస్పత్రికి దానం చేశారు. అనంతరం పార్థివదేహానికి అంతిమ యాత్ర నిర్వహించి, కుటుంబ సభ్యులు, సీపీఎం, సీపీఐ నాయకులు ర్యాలీగా తీసుకెళ్లి ఏఎంసీకి అప్పగించారు.

40 ఏళ్ల పాటు సీపీఎంలో సేవలు

కృష్ణమూర్తి సీపీఎంలో కీలక కార్యకర్తగా ఉంటూ సుమారు 40 ఏళ్ల పాటు ఆరిలోవ ప్రాంతంలో సేవలు అందించారు. 1984లో ఆరిలోవ కాలనీ ఏర్పాటైనప్పటి నుంచి ఈ ప్రాంతంలో ప్రజా సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేశారు. మరోవైపు సుమారు 20 ఏళ్ల పాటు జగదాంబ జంక్షన్‌లోని సీపీఎం కార్యాలయంలో అకౌంటెంట్ బాధ్యతలు నిర్వర్తించారు. తన ఇద్దరు పిల్లలకు కులాంతర వివాహాలు జరిపించడం ఆయనలో కమ్యూనిజం భావాలు నాటుకుపోయాయనడానికి నిదర్శనమని సంస్మరణ సభలో పలువురు వక్తలు కొనియాడారు.

సూసైడ్ నోట్ రాసి విద్యార్థిని బలవన్మరణం



లావణ్య

ఎంవీపీ కాలనీ: వెంకోజీపాలేనికి చెందిన సాబి లావణ్య అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. వెంకోజీపాలేనికి చెందిన శ్రీను, అతని భార్య కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె లావణ్య ప్రస్తుతం విజయనగరం ఎంఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. తల్లిదండ్రులు బుధవారం పనులకు వెళ్లగా లావణ్య ఇంట్లోనే ఉంది. వారు వచ్చి చూసేసరికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. ఎంవీపీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే లావణ్య తాను ఠాగూర్ అనే యువకుణ్ని ప్రేమిస్తున్నట్టు, అతనితో కలిసి జీవించే అవకాశం లేకనే చనిపోతున్నట్టు సూసైడ్ నోట్ రాసినట్టు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలకు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

1970 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం



రేషన్ డిపోలో అదనంగా నిల్వ ఉన్న బియ్యంతో విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు, డిపో డీలర్

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు పెదగదిలి దరి సంజయ్‌గాంధీ కాలనీలోని ఓ రేషన్ డిపోలో అనధికారికంగా నిల్వ ఉన్న 1970 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సర్వర్ పని చేయక ఐదు రోజులుగా ఎటూ తేలని ఈ బియ్యం వ్యవహారం బుధవారం ఎట్టకేలకు ఓ కొలిక్కివచ్చింది. సంజయ్‌గాంధీ కాలనీలో 220 నంబరు రేషన్ డిపోలో అనధికారికంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్టు విజిలెన్స్ అధికారులకు ఈనెల 13న రాత్రి సమాచారం అందింది. దీంతో ఆరిలోవ పోలీసుల సహాయంతో విజిలెన్స్ సీఐ లక్ష్మోజీ, సిబ్బందితో ఆ డిపోపై అదే రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత దాడి చేశారు. బియ్యం నిల్వున్నట్టు గమనించి ఆ డిపోకు తాళం వేసి మరుసటి రోజు సివిల్ సప్లై ఆర్‌ఐ రమేష్‌తో కలసి వెళ్లి బియ్యం బస్తాలు పరిశీలించారు. ఆ రోజు నుంచి మంగళవారం వరకు సర్వర్ పనిచేయకపోవడంతో ఎన్ని కిలోల బియ్యం ఉన్నాయో తెలియక మళ్లీ డిపోకు తాళం వేసి వెళ్లిపోయారు. బుధవారం ఆన్‌లైన్ పనిచేయడంతో విజిలెన్స్ సీఐ, పౌర సరఫరాల విభాగం ఆర్‌ఐ డిపోలో నిల్వ ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. 1970 కిలోల పీడీఎస్ బియ్యం అదనంగా ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని 220 నంబరు డిపోను సీజ్ చేసినట్టు ఆర్‌ఐ రమేష్ తెలిపారు. డిపో డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేశామన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో ఉచిత వైద్య పరీక్షలు

ఎంవీపీ కాలనీ: వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రిలో బుధవారం ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత ఆరోగ్య పరీక్షల ప్యాకేజీని ఆస్పత్రి యాజమాన్యం ప్రారంభించింది. ఈ మేరకు పోస్టర్‌ను వైద్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎంవీపీ బ్రాంచి హెడ్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఇండియాలో కాలేయ సంబంధిత వ్యాధులు అధికంగా ఉన్నాయన్నారు. ఉచిత ఆరోగ్య పరీక్షల్లో భాగంగా యూఎస్‌జీ అబ్‌డోమెన్, లివర్ ఫంక్షన్ టెస్ట్, కంప్లీట్ బ్లడ్ కౌంట్, సర్జికల్ అండ్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటారాలజిస్ట్ కన్సల్టేషన్ తదితర సేవలు ఈ నెల 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

ఎంవీపీ కాలనీ: బీసీల అభివృద్ధి, సంక్షేమానికి సర్దార్ గౌతు లచ్చన్న అందించిన సేవలు చిరస్మరణీయమని బీసీ స్టడీ సర్కిల్స్ ఎంప్లాయీస్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు అన్నారు. గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా బుధవారం ఎంవీపీ కాలనీలోని గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం లచ్చన్న అహర్నిశలు శ్రమించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి శ్రీదేవి, బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారమ్

తెలుగు విభాగం సందర్శన



తెలుగు విభాగాన్ని సందర్శించిన శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

ఏయూ క్యాంపస్: విద్యా విజ్ఞాన పర్యటనలో భాగంగా శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగాన్ని సందర్శించారు. విభాగంలో ప్రవేశాల విధానం, ఆచార్యులు, వసతులు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు విద్యార్థులకు విభాగాన్ని చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి విజ్ఞాన పర్యటనల వల్ల విద్యార్థులకు విశ్వవిద్యాలయాల మౌలిక వసతులతో పాటు అధ్యాపకుల బోధన విధానం, పరిశోధన ఫలితాలు తెలుసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ విజ్ఞాన పర్యటనకు మార్గ దర్శకత్వం వహిస్తున్న తెలుగు అధ్యాపకులు డా ఎస్.ఢిల్లీశ్వరరావు, పి.ఎస్.నారాయణలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాణి నాగమల్లికకు ఏయూ డాక్టరేట్



వీసీ ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరిస్తున్న రాణి నాగమల్లిక

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం చరిత్ర, ఆర్కియాలజీ విభాగం పరిశోధక విద్యార్థిని పాకా రాణి నాగమల్లికకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. ఆచార్య బి.సుధాకరరెడ్డి, ఆచార్య పి.డి.సత్యపాల్ సంయుక్త పర్యవేక్షణలో 'సోషల్ అండ్ ఎకనామిక్ కండీషన్స్ ఆఫ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఇన్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ ఏజెన్సీ-ఏ హిస్టారికల్ స్టడీ(1956–2014) అంశంపై జరిపిన పరిశోధనకు ఆమె డాక్టరేట్ పొందింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను నాగమల్లిక స్వీకరించారు. ఆమెకు ఆచార్యులు అభినందనలు తెలిపారు.

'మా నమ్మకం నువ్వే జగన్'కు బ్రహ్మరథం



వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మలకు సర్వే పత్రాలు అందిస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ అప్పారావు

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. జీవీఎంసీ 16వ వార్డులో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన వారికి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం వార్డులో చేసిన సర్వే పత్రాలను ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు నుంచి ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం వైఎస్సార్‌సీపీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు. సమస్యల పరిష్కారంతో పాటు, పథకాలు అందుతున్న తీరును కన్వీనర్లు, గృహసారథులు ఎంతో చిత్తశుద్ధితో పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు ఒమ్మి పోలరత్నం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మద్దిలపాలెం: నక్కవానిపాలెంలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో 1972–73 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. ఇందుకు పితాపురం కాలనీలోని పూర్వ విద్యార్థి ఇల్లు వేదికగా నిలిచింది. మేము వయస్సుకు వచ్చామంటూ నాలుగు దశాబ్దాల క్రితం చేసిన అల్లరిని నెమరువేసుకున్నారు.. ఆనాటి స్నేహ బంధంలో మాధుర్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఒరేయ్ ఎలా ఉన్నావంటూ మిత్ర బంధంతో పలకరింపులు, కుశలమా మిత్రమా అంటూ ఆత్మీయ ప్రశ్నలతో ఉత్సాహంగా గడిపారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. ఆరోగ్యపరిస్థితి, కుటుంబ విషయాలను చర్చించుకున్నారు. ఆ రోజుల్లో పెద్దలన్నా.. గురువులన్నా ఎంతో గౌరవంగా ఉండేవారంటూ చెప్పుకున్నారు. అనంతరం అందరూ కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.అప్పారావు, బి.కె.రెడ్డి, కండిపల్లి సుబ్బారావు, కాగిత రమేష్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



వంశీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆరిలోవ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆరిలోవలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరిలోవ ఎస్‌ఐ అనిల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టీఐసీ పాయింట్ వద్ద నివాసముంటున్న రాపర్తి వంశీ(33) ఇసుకతోట సమీప విష్ణు హోండా షోరూంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య జ్యోతి ఓ బంగారం ఫైనాన్స్ సంస్థలో పని చేస్తోంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ఎప్పటిలాగే బుధవారం డ్యూటీకి వెళ్లిన వంశీ.. షోరూం నుంచి ఉదయం 10 గంటలకు వేరే బైక్‌తో బయటకు వచ్చి తిరిగి షోరూంకు వెళ్లలేదు. దీంతో షోరూం మేనేజర్ ఉదయం 11.30 గంటలు, మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అతని భార్య జ్యోతి కూడా డ్యూటీ నుంచి మధ్యాహ్నం 12.50 గంటలకు ఇంటికి వచ్చింది. తలుపునకు లోపల నుంచి గడియపెట్టుకొని ఇంట్లో ఎవరో ఉండడాన్ని ఆమె గమనించింది. తలుపులు ఎంతకొట్టినా తీయకపోవడంతో స్థానికుల సహాయంతో తాళం పగలుగొట్టి చూసేసరికి ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వంశీ వేలాడుతున్నాడు. దీంతో ఆమె కన్నీటి పర్యంతమై బంధువులకు సమాచారం అందించింది. ఈ విషయం తెలుసుకున్న ఆరిలోవ సీఐ సోమశేఖర్, ఎస్‌ఐ అనిల్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఆత్యహత్యకు గల కారణాల గురించి ఆరా తీశారు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

కృష్ణా కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరాన్ని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిట్-1 రత్నభారతి, యూనిట్-2 శామ్యూల్ డేవిడ్ రాజు, 50 మంది వలంటీర్లు కళాశాల దత్తత తీసుకున్న వార్డులో ఈ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ శిబిరం ఈ నెల 24వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. కేఆర్ఎం కాలనీ యూనిట్-1, రజకవీధిలో యూనిట్-2 బృందం సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారని తెలిపారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ అధికారులు ఉమామహేశ్వరావు, సుధీర్ పాల్గొన్నారు.